క్లుప్తంగా

సబ్‌రిజిస్ట్రార్, సిబ్బందికి సన్మానం


సబ్‌రిజిస్ట్రార్ భూషణాన్ని సన్మానిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసిన రిజిస్ట్రార్ మానుపాటి భూషణం బదిలీపై జంగారెడ్డిగూడెం వెళ్లారు. అలాగే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ఎస్.సుదారిలు ఆచంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్లు శుక్రవారం సాయంత్రం కార్యాలయం పనులు ముగిసిన అనంతరం పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రవికాంత్, భానుమూర్తి, కపిలి కృష్ణ, గోటేటి శ్రీనివాస్, కడలి శ్రీనివాస్, దేవళ్ల శివరామకృష్ణ, ఇ.శ్రీనివాసరావు, వై.నాగిరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి చికిత్సలు

పాలకొల్లు సెంట్రల్: నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో వాకర్స్ క్లబ్ తన వంతు సహాయసహకారాలు అందిస్తుందని క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. శనివారం 11 మంది వృద్ధులకు రూ.50 వేల వ్యయంతో ఉచితంగా కంటి చికిత్సలు చేయించారు. అనంతరం ఉచితంగా మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ షేక్ పీర్‌సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కళ్యాణ్ పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాల అభివృద్ధికి కృషి

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గ పరిధిలో ఉన్న విద్యార్థులతో పాటు సమీప గ్రామాల విద్యార్థులకు విద్యాపరంగా అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి రామానాయుడు మాట్లాడుతూ కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, పట్టణ సీఐ కె.రజనీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, పెచ్చెట్టి బాబు, మామిడిశెట్టి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

డీపీఓను కలసిన పంచాయతీ కార్యదర్శులు

యలమంచిలి: పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అరుణశ్రీని శనివారం పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షుడు పాలా శారదా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవబత్తుల నాగదేవి, గౌరవ అధ్యక్షులు బి.సత్యనారాయణ, కోశాధికారి ఎస్.వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పెనుగొండ: ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకునే వారు మార్చి 25లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ డీఈఈ ఎంవీ గోపాల రాజు అన్నారు. శనివారం వడలి పంచాయతీ వద్ద లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి నిర్మాణాలు పూర్తి అవగానే వారి ఖాతాల్లోనే నగదు నేరుగా జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.లక్ష్మణ్, గ్రామ కార్యదర్శి పీపీ రామకృష్ణ, ఉప్పలపాటి చంటి, అంగర వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన వీఆర్‌ఓలు

యలమంచిలి: యలమంచిలి తహసీల్దార్ (ఎఫ్ఎసి)గా గ్రంధి పవన్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై యలమంచిలి వచ్చారు. ఆయనకు గతంలో యలమంచిలిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన పవన్‌కు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

డాక్టర్ బాలచందర్‌కు జాషువా పురస్కారం

పెనుగొండ: కవిరత్న డాక్టర్ బాల చందర్ సాదే జాషువా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు శనివారం డాక్టర్ బాలచందర్ పెనుగొండలో వివరాలు అందించారు. రాజమహేంద్రవరం కళా గౌతమి సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం ఆదిత్యా డిగ్రీ కళాశాలలో నిర్వహించి నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకల్లో జాషువా పురస్కారాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకట సత్యనారాయణ మూర్తి,, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిత్యా రమాదేవి, అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఆదిత్యా ప్రిన్సిపాల్ చందూరి ఫణికుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. పురస్కారం అందుకొన్న డాక్టర్ బాలచందర్‌ను పలువురు అభినందించారు.

లడ్డూ అపవిత్రత పాపం బాబుదే

పాలకొల్లు అర్బన్: తిరుపతి లడ్డూ విశిష్టతను అపవిత్రం చేసి భక్తుల మనోభావాలను సీఎం చంద్రబాబు తీవ్రంగా దెబ్బతీశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా మండిపడ్డారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లోని శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పాప ప్రక్షాళన పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి తులసిమాల సమర్పించారు. భక్తులకు లడ్డూలు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాదరాజు విలేకరులతో మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో సీఎం చంద్రబాబు హిందువులు భక్తితో పూజించే శ్రీవేంకటేశ్వరస్వామి విశిష్టతను దెబ్బ తీసే విధంగా ప్రవర్తించి భక్తులను ఆందోళనకు గురి చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజల్లోకి వెళ్తే ప్రజల నుంచి ఛీత్కారాలు, నిరసనలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే దురుద్దేశంతో సీఎం చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడ్డారని ప్రసాదరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 5 సార్లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా 5 సార్లు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారని గుర్తు చేశారు. అప్పుడు ప్రశ్నించని చంద్రబాబు మాజీ సీఎం జగన్ డిక్లరేషన్ ఇవ్వాలనడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబుకి మంచి మనస్సు ఇవ్వాలని, ప్రజలకు సక్రమమైన పాలన అందించి, సంక్షేమ ఫలాలు అందించే మనస్సు ఇవ్వమని శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తూ పాప ప్రక్షాళన పూజలు చేసినట్లు ప్రసాదరాజు చెప్పారు. పూజ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయ వర్మ, జిల్లా యూత్ అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, పార్టీ రాష్ట్ర నాయకులు ఉచ్చుల స్టాలిన్, మద్దా చంద్రకళ, బొడ్డేటి సూర్యనారాయణ, రావి నాగేశ్వరరావు, నంబూరి పవన్, కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, మోకా నరసింహారావు, చెన్ను విజయ్, పిల్లా అప్పాజీ, కాసాని కేశవరావు, గవర బుజ్జి, కల్యాణం గంగాధరరావు, కాసా విజయదుర్గాభవాని, శంకరాపు శ్రీనివాస్, దేవ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లు అర్బన్: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు


నరసాపురం: రాజగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

ఆచంటలో...

పెనుగొండ: ప్రజల భక్తి విశ్వాసాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్ విమర్శించారు. శనివారం ఆచంటలోని మదన గోపాలస్వామి ఆలయంలో చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ పూజలు నిర్వహించారు. మనవర్తి విజయ్‌కుమార్, వస్కా ఉమేష్, గొడర్తి కష్ణకుమారి, మముడూరి శ్రీనివాస్, బర్ల మహేష్, శీలం చిట్టి బండి పద్మమోహన్‌రావు, కొండేటి సుబ్రహ్మణ్యం, పీతల నాగేశ్వరరావు, మంగిన ఆంజనేయులు, నెక్కంటి నవీన్, దాసరి ప్రశాంత్, బాలిన వీరాస్వామి పాల్గొన్నారు.

వైఫల్యాలపై దృష్టి మరల్చడానికే

పెనుగొండ: ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేని చంద్రబాబు, ప్రజల దృష్టి మరల్చడానికే దేవుడి ప్రసాదంపైనా రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి విమర్శించారు. చంద్రబాబుకు సద్బుద్ధి కల్పించాలని కోరుతూ శనివారం పెనుగొండలో శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోని ఉపాలయం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగడం చంద్రబాబు నైజమన్నారు. ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, సాక్ష్యాలు చూపించమంటే మాత్రం వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబీరెడ్డి), ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనరు పలివెల శ్రీను, విద్యామౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొవ్వూరు వేణుమాధవ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, వెలగల శ్రీనివాస రెడ్డి, నూలి పవన్, పోడూరి అప్పాజీ, ఆసు నగరి, చరణ్ రెడ్డి, కుడిపూడి సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఎన్ రెడ్డి, సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ: ఆచంట మదన గోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆవాస్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

నరసాపురం రూరల్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన వారంతా ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కోరారు. నరసాపురం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇళ్ల లబ్ధిదారులు, అధికారులతో ఆయన మాట్లాడారు. తొలుత ఆయన పట్టణలోని లబ్ధిదారులు కేటాయించిన ఇళ్ల స్థలాల లే అవుట్‌లను ఆయన సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, ఇంకా పూడిక కాని స్థలం, నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల బిల్లుల చెల్లింపులు తదితర వివరాలను హౌసింగ్ డీఈ పి వెంకటేశ్వరరావు, ఏఈ రవీంద్రలను అడిగి తెలుసుకున్నారు.

తప్పు చేసిన వారిని వదిలి మాపై చర్యలా..?


ఆచంట వేమవరంలో గృహ నిర్బంధంలో మాలమహానాడు అధ్యక్షుడు పుష్పరాజ్

పెనుగొండ: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచిన ఉండి శాసన సభ్యుడు రఘురామకృష్ణరాజును వదలి, ప్రశ్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆచంట వేమవరంలో పుష్పరాజ్‌ను పోలీసులు గృహనిర్బంధం చేయడంతో తీవ్రంగా విమర్శించారు. సీఎం చంద్రబాబు తక్షణం కల్పించుకుని తక్షణ చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వదలని వరుణుడు–ఆందోళనలో రైతులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారడంతో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా సుమారు 36.4 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో పలు పల్లపు ప్రాంతాలు మునగి పోవడంతో పాటు రహదారులపైకి వర్షపు నీరు చేరింది. మొగల్తూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో చేలలో నిలిచిన నీటిని మోటార్లు వేసి బయటకు తోడుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు వేసిన ఆకుమడులు మునిగిపోవడంతో పాటు నాట్లు వేసిన చేలల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు సాగు ప్రారంభంలోనే ఆర్థికంగా నష్టపోయారు. ఈ ఏడాది 1365 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనా వేయగా ప్రస్తుతానికి కేవలం 634 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారంటే పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మరోసారి వర్షం పడి పొలాలు ముంపునకు గురైతే పరిస్థితి దారుణంగా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మొగల్తూరులో నీట మునిగిన చేలు

టిడ్కో గృహాల లబ్ధిదారుల కల నెరవేరేనా?

నేడు పట్టణానికి మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాక

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ ఆదివారం పాలకొల్లు రానున్నారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 15 కోట్ల వ్యయంతో పనులు పూర్తి చేసి ప్రారంభించిన వాటర్ వర్క్స్ పనులను పరిశీలించనున్నారు. అలాగే హిందూ శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, అబ్దుల్‌కలాం పార్క్, రామగుండం పార్కు, ఎన్‌టీఆర్ కళాక్షేత్రం, అన్నా క్యాంటీన్ అనంతరం టిడ్కో గృహాలను పరిశీలించనున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా పాలకొల్లు బహిరంగ సభలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రావణ మాసంలో ఇంటి గృహప్రవేశాలు చేయిస్తానని హామి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడులు అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి మాట్లాడడమే మానేశారు. రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి పొంగూరి నారాయణ దృష్టిలో పెట్టానని ఒకసారి మంత్రిని పాలకొల్లు టిడ్కో గృహాలకు తీసుకువచ్చి సమస్యను వివరిస్తానని ఇటీవల మంత్రి నిమ్మల లబ్ధిదారులను ఉద్దేశించి అన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రానున్నారు. టిడ్కో గృహాల్లో పది శాతం పనులు మాత్రమే చేయాల్సి ఉందని లబ్ధిదారులకు, ప్రజలకు మంత్రి నిమ్మల చెబుతానే ఉన్నారు. మరి పది శాతం పనులు పూర్తిచేయడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో నేడు మంత్రి నారాయణ హామీపై లబ్ధిదారుల గృహప్రవేశాలు ఆధారపడి ఉన్నాయి. అలాగే నాడు టిడ్కో రుణాలు బ్యాంకులకు చెల్లించవద్దని లబ్ధిదారులకు మంత్రి నిమ్మల చెప్పారు. మరి ఇప్పుడు బ్యాంకు రుణాలు చెల్లించుకోవాలని చెబుతున్నారని కొందరు లబ్ధిదారులు వాపోతున్నారు. ఆ రుణాల రద్దుపై ప్రకటన చేస్తారా? గృహప్రవేశాలు ఎప్పుడు చేయిస్తారు? అనే ఆశతో గృహ లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశలు నేరవేరుతాయో లేక నిరాశే అవుతుందో వేచి చూడాల్సిందే.


పాలకొల్లులోని టిడ్కో గృహాల సముదాయం

వసతి గృహాల్లో కనీస వసతులు ఉండాలి

నరసాపురం: వసతి గృహాల్లో కనీస వసతులు సమకూర్చే అంశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ ఆదేశించారు. శనివారం ఆమె పట్టణంలోని వలంధర్‌రేవు వద్ద ఉన్న హాలెండ్ వాల్ష్ బాలికల వసతి గృహాన్ని, ఎన్టీఆర్ కాలనీలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడం, తలుపులు, కిటికీలకు దోమల మెస్‌లు లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఆమె వెంట అదనపు సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్, డీఎస్పీ మురళీకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, లీగల్ సర్వీస్ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, వై.దేవేంద్రఫణికర్ ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి విజయదుర్గ

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

మొగల్తూరు: ర్యాబిస్ వ్యాధికి చికిత్స అంటూ లేదని, ప్రతి ఏడాది పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకా వేయించడమే ర్యాబిస్ వ్యాధికి నివారణమార్గమని వెటర్నరీ డాక్టర్ నీలిమ తెలిపారు. ప్రపంచ ర్యాబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం మొగల్తూరులోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి మనుషుల్లో ర్యాబిస్ మరణాలు లేకుండా చేయడమే లక్ష్యంగా మనమంతా కృషి చేయాలన్నారు. అనంతరం సుమారు 50 పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు.

పెంపుడు కుక్కకు ర్యాబిస్ టీకా వేస్తున్న దృశ్యం →



చెత్త నుంచి సంపద తయారీ

పెనుగొండ: వర్మీ కంపోస్ట్‌తో చెత్త నుంచి సంపద సృష్టించుకోవచ్చునని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అన్నారు. శనివారం వడలిలోని వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీపీ రామకృష్ణ, ఉప్పలపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


కొత్తపేటలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. బాలామృతంతో పౌష్టికాహారం తయారు చేసి అవగాహన కల్పించారు. సర్పంచ్ కవురు భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవురు భాస్కరబాబు, కవురు మురళి, అంగన్‌వాడీ టీచర్లు జె.హేమలక్ష్మి, జి.పావని కుమారి, ఎల్.దానమ్మ పాల్గొన్నారు.

పోడూరులో..

పాలకొల్లు అర్బన్: పౌష్టికాహారం భుజించడం వల్ల రక్తహీనత సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చని సూపర్‌వైజర్ ఎంఎస్ పద్మావతి అన్నారు. పోడూరు మండలం గుమ్మలూరు శివారు బొల్లేటిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆకుకూరలు, బాలామృతంతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ జె.ఎస్తేరురాణి, సీహెచ్ వెంకటలక్ష్మి, సీహెచ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా, భగత్‌సింగ్ జయంతి


పెనుగొండ: ఆచంటలో కవి జాషువా, భగత్‌సింగ్‌లకు నివాళులర్పిస్తున్న దృశ్యం


పాలకొల్లు సెంట్రల్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పెనుగొండ: సామాజిక అసమానతలు, సాంఘిక దురాచారాలు లేని సమ సమాజ నిర్మాణం కోసం యువత పాటు పడాలని ఆచంట ఎంవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీదేవి అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో భారత స్వాతంత్ర పోరాట అమర వీరుడు భగత్ సింగ్, కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ, లైబ్రేరియన్ కె.హరి రామలింగేశ్వరరావు, ఎస్.సూరపరాజు, పి. మోహనరావు, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్రం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేసిన వీరుల్లో భగత్‌సింగ్ ఒకరని అన్నారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, భవానీ దుర్గ, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్తూరు: మొగల్తూరు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు అర్హులైన వారు అక్టోబర్ 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ బి.ఊర్మిల శనివారం ఓ ప్రకటనలో కోరారు. మొగల్తూరు మండలంలోని కొత్తోట పంచాయతీ కాకాని చెరువు అంగన్‌వాడీ కేంద్రం (బీసీ–ఏ కార్యకర్త పోస్టుకు, మొగల్తూరు పంచాయతీ గరువుపల్లిపాలెంలోని (బీసీ–ఏ) సహాయకురాలు, పేరుపాలెం సౌత్ పంచాయతీ బీకేమెరకలో (ఓపెన్) సహాయకురాలు, నరసాపురం మండలంలోని సరిపలిగరువు (ఎస్‌సీ) సహాయకురాలు, నరసాపురం మున్సిపాలిటీలోని క్రిస్టియన్ పేట (ఓపెన్) కేటగిరిలో సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను నేరుగా తమ కార్యాలయంలో అందించాలని ఆమె కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ సీహెచ్ ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లిపాడు అంగన్‌వాడీ వర్కర్ (ఓసీ), లంకలకోడేరు పెదపేట (ఎస్సీ), మేడపాడు సాకావారిపేట మినీ అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), దగ్గులూరు కందపెరడు (ఓసీ–దివ్యాంగులు), అరట్లకట్ట కమ్ము (ఎస్సీ), పెద మామిడిపల్లి (బీసీబీ), వెలివెల చర్చిపేట (ఎస్సీ), మినిమించిలిపాడు (ఓసీ) అంగన్‌వాడీ సహాయకురాలు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇందిర తెలిపారు. విద్యార్హతలు, నివాసం, కులము, పుట్టిన తేదీ, అంగవైకల్యం, భర్త మరణించినచో ధ్రువీకరణ పత్రం, మైనర్ పిల్లలు ఉంటే వివరాలతో అక్టోబర్ 5లోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లు పూర్తయినవారు అర్హులని పేర్కొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుమంట్ర మండలం మల్లిపూడి–01(ఎస్సీ), పెనుగొండ మండలం జిలం చెరువు(ఓపెన్) కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్తకర్తలకు, నడిపూడి కట్టావారి పాలెం(బీసీ–బీ) మినీ కేంద్రం కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా పెనుమంట్ర మండలం ఆలమూరు01(ఎస్సీ), పెనుగొండ మండలం ములపర్రు–03(ఓపెన్), ఆచంట మండలం ఆచంట చినపేట(ఎస్సీ), ఆచంట కానుబోతు గుంట(బీసీ–బీ) కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో రిజర్వేషన్లుకు అనుగుణంగా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.